# నూతన జీవితం

వి. వి. సుబ్రమణ్యేశ్వరరావు

అలంకరణ చేసి మాధవిని గదిలోకి పంపారు. తలయెత్తి భర్త ముఖంలోకి చూచింది. ఆ చూపులు చాలా తీక్షణంగా పదునుగా వున్నాయి. క్రోధంవల్ల చిన్న కళ్ళలో ఎర్రజీరలు తొంగిచూస్తున్నాయి.

"ఈ పెళ్ళంటే నీ కేమాత్రం యిష్టం లేదు అవునా?" అన్నాడు శ్రీధర్ కఠినంగా. "నీకు యిష్టం లేకపోవుటకు కారణం నా అందం హుఁ.... నన్నెవరు యిష్టపడతారు — లోతుకు పీక్కుపోయిన దవడలు — పొడుచుకొచ్చిన ముక్కు — గుంటకళ్ళు — పెద్ద పెదవులు — నల్లగా — సన్నగా — వుంటాను. అవునా?" శ్రీధర్ అడిగాడు.

"మీ అందాన్ని మీరే వర్ణించుకుంటున్నారు." మాధవి అపహాస్యం చేస్తూన్నట్టు అన్నది.

"ఏదో పెద్దలు ఏడుస్తారని నన్ను చేసుకున్నట్టున్నావు చూడు మాధవీ! ప్రతి స్త్రీలాగే ప్రతి పురుషుడు తన భార్య తనని మరెవ్వరూ ప్రేమించలేనంతగా ప్రేమించాలని, ఆమె మనస్సు తన మనస్సు ఒకటై పోవాలని, ఇరువురి తనువులు ఏకమవ్వాలని కోరుకోవడం తప్పు కాదేమో! కాని అలా జరగడం నా జీవితంలో జరగని పని. నువ్వు నన్ను ప్రేమించలేవు. నా తోటి జీవితాన్ని సహించలేవు. నీకు యిష్టం లేనప్పుడు నేను నీ ప్రేమ కావాలని అర్థించే బలహీనుడను కాదు. నీకై నువ్వు నన్ను కోరే వరకూ నిన్ను తాకను. నిన్ను బాధించను" కొంచెంసేపు ఆగి మళ్ళీ అన్నాడు.

"నువ్వు కూడా విన్నావనుకుంటాను. పెళ్ళికూతురు ముఖం చూడు ఎలా ముడుచుకుపోయిందో, తలంబ్రాలు విసురుగా పోస్తున్నది. మాంగల్యం కడుతుంటే అలా కన్నీళ్ళు కారుస్తుందేం? ఈ పెళ్ళి జరగటం ఆ అమ్మాయికి యిష్టము లేదేమో?" అన్నాడు నెమ్మదిగా చంద్రుని కమ్ముకునే మబ్బులను చూస్తూ....

"వాళ్ళే కాకి ముక్కుకు దొండపండని అనడం కూడా వినలేదేమో?" హేళనగా అన్నది మాధవి. "నిజానికి మిమ్మల్ని చేసుకోవడం నా కిష్టం లేదు. మా వాళ్ళందరు మీలో ఏదో గొప్పతనం చూశారట. మంచి ఉద్యోగంలో ఉన్నారట. మగవాడు అనే ఆకారం ఉంటే చాలు పెళ్ళాడటానికి అన్నారు ఇవన్నీ వాళ్ళభిప్రాయాలు. వారందరినీ ఎదిరించే ధైర్యం నాకు లేదు. అందుకే మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాను. మీ పొందును సహించను. సహించలేను. అందుకు నా అంతరంగము ఒప్పుకోదు. అందుకే మీరు నన్ను మా యింట్లోనే వదిలెయ్యండి. ఏదో ఉద్యోగం చేసుకుంటూ నా బ్రతుకు నేను బ్రతుకుతాను." అంది మాధవి కిటికీలోనించి చంద్రుని చూస్తూ. ఆమె ముఖంలో ఏలాంటి భావమూ తొంగి చూడలేదు ఆ క్షణంలో....

"నువ్వనుకున్నంత సులభం కాదు ఒంటరిగా బ్రతకడం. మీ వాళ్ళందరు నన్ను అపార్థము చేసుకుంటారు. మొగుడిని వదిలేసిన ఆడదాన్ని ఈ సమాజం ఎలా

చూస్తుందో నీకు తెలియనిది కాదు. నువ్వు నిందలు పడటం నా కిష్టం లేదు. అందుకే నిన్ను నా వెంట తీసుకు వెళతాను. నీకు ప్రత్యేకమైనగది ఏర్పాటు చేస్తాను అందులో నుంచి బయటికి రాకుండా నా ముఖం చూడకుండా కాలం గడపవచ్చు. ఈ ఒక్క రాత్రి ఎలాగో గడుపు" అన్నాడు గంభీరంగా శ్రీధర్.

అవసరం లేదు. నేను వెళ్ళిపోతాను." పట్టుదలగా అన్నది మాధవి.

"ప్లీజ్, కొంచెం ఆలోచించు. నీ జీవితం నవ్వులపాలు చేసుకొని నా జీవితాన్ని నవ్వుల పాలు చేయకు." అన్నాడు శ్రీధర్.

మరేమీ అనలేకపోయింది మాధవి. దుప్పటి పరుచుకొని గచ్చు మీద నిద్రపోయింది. మరుసటిరోజు ఇద్దరూ ప్రయాణమయ్యారు. శ్రీధర్ మాధవిని తాకటానికి ఇష్టపడలేదు. అందుకే, టిక్కెట్లకని మాధవి కంటే ముందుగా రైల్వేస్టేషన్ కెళ్లాడు. ఫస్ట్‌క్లాసు టిక్కెట్టుకొనే తాహతున్నప్పటికీ తన నిగ్రహం కోల్పోవచ్చుననే భయంతో థర్డ్ క్లాస్‌లో కూర్చున్నారు. మాధవి మౌనంగానిర్లిప్తంగావున్నది.శ్రీధర్ మొహం గాఢంగా అలుముకున్న నల్లమబ్బులావుంది. అసలు మాధవి శ్రీధర్‌ని చూడ్డానికి ప్రయత్నం చెయ్యలేదు హైదరాబాద్ స్టేషన్ వచ్చింది. స్టేషన్ బయటికివచ్చి ఆటోలో కూర్చున్నారు. ఆటో పావుగంటలో ఒద్దికగా తీర్చిదిద్దినట్లుగా వున్న డాబాముందు ఆగింది.

మాధవి కాంపౌండు వాల్ దాటి లోపలకు నడిచింది. అశోకవృక్షాలు స్వాగతం చెబుతున్నట్లుగా ఇరువైపులా నిల్చున్నాయి. సాయంత్రపు నీరెండ చెట్ల ఆకులపైన వింతగా పరుచుకుంది. రకరకాల పూల మొక్కలతో అందంగా వుంది తోట. గుమ్మం దగ్గిర నడివయస్సు స్త్రీ హారతి పట్టుకు నిల్చుంది. హారతి పూర్తిగా తీసుకోకుండానే విసురుగా లోపలికి అడుగు పెట్టింది మాధవి.

సింపుల్‌గా వుంది గది. మధ్యలో పెద్ద సైజు టీపాయ్. దానిమీద అందముగా హంసలతో పెయింట్ చెయ్యబడిన పవర్ వాజ్, దానిలో పెద్ద పెద్ద లిల్లీ పూలగుత్తులు ఆకులతోనిండి ఎంతో అందముగావున్నాయి. గచ్చుమీద సీడలు కనిపిస్తున్నాయ్. లోపల నాలుగు గదులున్నాయి. ఒకప్రక్క గది ముందు నీలిరంగు కర్టెన్. దానిమీద రాధా మాధవుల చిత్రం ఎంబ్రాయిడరీ చేయబడి వున్నది.

"రాజమ్మా ! స్నానానికి నీళ్ళుతోడు" అని ఆ నడివయస్సు స్త్రీని అవతలకి పంపి. బంగారు బొమ్మలా నిల్చునివున్న మాధవిని చూస్తూ అన్నాడు శ్రీధర్ గంభీరంగా "అది నీగది. అక్కడ నీకు రాజమ్మ ద్వారా అన్ని సౌకర్యములు జరుగుతాయ్. అందులో నుంచి నువ్వు బయటికి రావలసినవసరం వుండదు."

అంతావిని తలవూపుతూ గదిలోకి అడుగు పెట్టింది మాధవి. ఐదు నిముషాల తర్వాత స్నానంచేసి లేత ఆకుపచ్చరంగు చీర కట్టుకొని సేమ్ కలర్ జాకెట్టు, బొట్టులతో అలంకరించుకొన్నది. ఆమె శరీర ఛాయకు చాలా అందముగా సరిపోయింది. ఆమె అలంకరణ. మిల్సుటేబుల్ వద్ద ప్రక్క ప్రక్కనే కుర్చీలు, రెండు పళ్ళాలు చూచి "రాజమ్మా ! ఆ పళ్ళాలు దూరముగాజరుపు" అంది కఠినంగా. రాజమ్మ ఆశ్చర్యపడుతూ మాధవి చెప్పినట్లు చేసింది. భోజనమైన తరువాత తన గదిలోకివచ్చి నవల చేతికి తీసుకుంది. నవల చదువుతూనే ఆలోచిస్తూ ఎప్పటికో నిద్రపోయింది ఆ రాత్రి.

* * *

మర్నాడు ఉదయం పాలగ్లాసు తీసుకు వచ్చింది రాజమ్మ మాధవి గదిలోకి.

"పాలు నిన్నెవరు తీసుకు రమ్మన్నారు. నేను పాలు తాగను. బోర్న్‌విటా తీసుకురా"

అని కోపంగా రాజమ్మను తిప్పిపంపించింది.

మాట్లాడకుండా వెళ్ళిపోయింది రాజమ్మ.

చీటికిమాటికి రాజమ్మ మీద విసుక్కోవడం మాధవికి అలవాటయి పోయింది. మాధవికి నవల్సు చదివి చదివి విసుకు పుట్టింది. ఒక రోజు హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. మహిళా మండలిలో మెంబరయితే తనకు కావలసినంత కాలక్షేపం అనుకుంది మాధవి తనలోతాను. ఈ ఆలోచనతోనే మరునటిరోజు మాధవి మహిళా మండలి సభ్యురాలయింది.

వారంరోజుల తరువాత "రాజమ్మా! మాధవిని పిలు" అన్నాడు శ్రీధర్.

ఆమె కళ్ళలో భయం కనిపించింది. అయినా "అమ్మగారూ, అయ్యగారు పిలుస్తున్నారు". అంది కర్టెన్ చాటునించి నెమ్మదిగా.

"నేను క్యాంప్‌కు వెళుతున్నాను ఇరవై రోజుల వరకురాను. ఈ మూడువందలు ఖర్చులకు వుంచు" అంటూ మూడువందలు టేబిల్ పైన పెట్టాడు.

"ఆ. ముష్టి మూడువందలు మీదగ్గరే వుంచుకోండి" అంది విసురుగా.

మౌనంగా మరో రెండువందలుతీసి అందులోచేర్చి వెళ్ళిపోయాడు శ్రీధర్.

ఈమధ్య మాధవికి క్షణంతీరిక వుండటం లేదు. మహిళా మండలి వార్షికోత్సవ సందర్భముగా నాటకాలు మేనేజ్ చేస్తూ దానికి కావలసిన ఏర్పాట్లన్నీ తానే స్వయంగా చూసుకుంటోంది. అందరి మధ్య ఉత్సాహంగా పాలరాతి బొమ్మలా హుషారుగా తిరుగుతోంది. మరునటి రోజు మాధవికి జ్వరం వచ్చింది. ఆ రోజు కన్నతల్లిలా, స్నేహితురాలుగా ఎంతో ఆప్యాయంగా సేవ చేసింది రాజమ్మ. ఆ ఆప్యాయతను కొలవటం మాధవికే తెలియదు.

జానకి తప్ప మహిళా మండలి స్త్రీలలో ఎవ్వరూ రాలేదు మాధవిని చూడటానికి. ఆప్యాయంగా పలకరించి వెళ్ళింది జానకి.

జానకి వచ్చినందుకు కొంచెం ఉపశాంతిని పొందింది మాధవి. "ఈవిడ భర్త గురించేనా ఆ రోజు ఎంతో అసహ్యంగా స్త్రీ లోలుడు అనుకున్నారు. పైగా ఈవిడ ఆస్తి చూచి చేసుకున్నాడుట" అనుకుంది. ముప్పై ఏళ్ళుంటాయి. నల్లగా, పొట్టిగా, చిన్న జడ వేసుకొని అనాకారిగా వున్నా ఎంత మంచి మనసు అనుకుంది.

మాధవి మర్నాడు పదిగంటలకు మహిళా మండలికి వెళ్ళింది. గదిలో అడుగు పెట్టబోయి, ఏవో మాటలు వినిపించి, అక్కడే ఆగిపోయింది. "విన్నావా సుజాతా... మాధవి భర్త నల్లగా, అసహ్యంగా వుంటాడట. అందుకే అతగాడిని ఈమె దగ్గరకు రానివ్వదట." తన అందాన్ని ఎప్పుడూ డబ్బాలా పొగిడే ఒక స్థూలకాయ సుందరి అంటోంది పెద్దగా "మొన్న వార్షికోత్సవంలో మాధవి, జానకిభర్త చాలా సేపు మాట్లాడుకున్నారు." అంది ఒక గొంతు. "ఆ... ప్రేమపాఠాలు నేర్చుకుంటున్నారేమో!" అంది మరో బొంగురు గొంతు. ఆ మాటలువిని, అక్కడ నిలవలేక ఆఫీసురూమ్‌కు వెళ్ళి తన మెంబరుషిప్‌కు రిజైన్ యిచ్చి, పరుగులాంటి నడకతో బయటికి వచ్చింది మాధవి.

మనశ్శాంతి దొరుకుతుందేమో అని జానకి యింటికి వెళ్ళింది మాధవి. ఇల్లు చాలా బాగుంది అనుకుంటూ గదిలోనికి అడుగు పెట్టింది. జానకి భర్త రామారావును చూసి అక్కడే ఆగిపోయింది.

"జానకి కోసం వచ్చారనుకుంటాను. లోపల వుంది వెళ్ళండి." నవ్వుతూ అన్నాడు రామారావు.

"అరే లేదే!" ఆశ్చర్యపడుతూ మధ్య గదిలోకి వచ్చిన మాధవితో రామారావు "తలుపుకు అడ్డంగా నిలబడి" జానకి మార్నింగ్ షోకి వెళ్ళింది ఇప్పుడు రాదు. నీ అందము, నా అందము సమన్వయం చెందితే ఎంత బాగుంటుందో" సీన్‌లా

నవ్వుతూ అన్నాడు.

"ఛీ దుర్మార్గుడా ! సిగ్గులేదూ ! సాటి స్త్రీని ఎంత నీచంగా ఊహిస్తున్నావు" అంది, పూడుకు పోయిన గొంతుతో

"నీ సంగతి తెలుసు మాధవీ.... నీ భర్త అందంగా లేడని అతడిని దరిచేర నియ్యవుట. నేం ఫర్వాలేదు. ఇక్కడ ఏం జరిగిన ఎవ్వరికీ తెలియదు. ఈ ఒక్కసారికి.... ప్లీజ్

"ఛీ అడ్డుతొలుగు ఇన్నాళ్ళు నీవు మంచి వాడివనుకున్నాను. ఇంత నీచుడవనుకోలేదు. ఏదో గొప్ప వాడివని అనాకారిని చేసుకొని సుఖ పెడుతున్నావని అనుకున్నాను. కాని నువ్వు స్త్రీలోలుడవని అనుకోలేదు" అంది ఆవేశముగా మాధవి భయంతో ఆమె గుండెలు అదురుతున్నాయి

"నువ్వు అబలవు ఎన్ని యుగాలు మారినా మగువలు అబలలే మాధవీ" అంటు మీదకు వస్తున్న రామారావును దగ్గరలో వున్న ఫ్లవర్ వాజ్ తీసి గురిచూసికొట్టి, ఒక్కవరుగున తలుపు తీసుకొని బయటికి వచ్చింది. ఇంటికి చేరి తన గదిలోకి వెళ్ళి దిండు తడిసేలా ఏడ్చింది మాధవి.

* *

"ఇదే మాయిల్లు" చెప్పింది మాలతి ఆ మేడ ముందు ఆగి.

"బావుంది" పరికిస్తూ అన్నది మాధవి. మహిళామండలిలో తన సభ్యత్వానికి రిజైన్ యిచ్చినా కొంతమంది మంచి స్నేహితులను వదులుకోలేకపోయింది మాధవి.

"లోపల కూడా చూద్దువుగా" గేటు తోసుకుని లోపలకు నడచింది మాలతి. మాలతి వెనుకే మాధవి.

వారికి ఎదురుగా వచ్చాడు. మూర్తి. మూర్తి మాలతి భర్త. నల్లగా, బొగ్గులా వున్నాడు లోపలికి పీక్కుపోయిన కళ్ళు. దేగ ముక్కు. సాగిన చెవులు. అగ్లీగా వున్నాడు.

"మావారు" పరిచయం చేసింది మాలతి.

నమస్కారము చేశాడు మూర్తి కాని మాధవి ప్రతి నమస్కారం చేయలేదు. మాలతిని, మూర్తిని మార్చి మార్చి చూస్తూ నిలుచుంది

"వెళ్ళొస్తా మాలతీ !" నవ్వుకుంటు వెళ్ళిపోయాడు మూర్తి.

కూర్చో మాధవీ" లోనికి వెళ్ళిన తరువాత తనొక కుర్చీలో కూర్చుంటూ ఎదురుగా వున్న మరొకుర్చీని చూపిస్తూ అన్నది మాలతి.

కూర్చుంది మాధవి

మాలతి అన్నది నవ్వుతూ "మూర్తిని పరిచయం చేసినప్పుడు నీ కన్నుల్లో ఆశ్చర్యం తొంగి చూడడం చూశాను ఆయనను ఎలా చేసుకున్నానని కదూ నీ అనుమానం"

తల వూపింది మాధవి

"కాలేజీలో చదివేటప్పుడు మే మిద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. కాని మా యింట్లోవాళ్ళు ఒప్పుకోలేదు. ఆయనను చేసుకుంటానంటే అంత అనాకారివాడిని ఎట్లా చేసుకుంటావ్ చేసుకుని జీవితాంతం ఎలా భరిస్తావ్ అన్నారు. కాని నేను వారి మాటల్ని లెక్క చెయ్యలేదు. ఆయన మనసు నాకు తెలుసు. నేను ఆయన ప్రాణాన్ననీ తెలుసు. అందుకే వారందర్నీ ఎదిరించి ఆయనను చేసుకున్నాను చాలామంది ఆశ్చర్యపోయారు మా జంటను చూసి. చాలా మంది నాముఖానే అడిగారు. బంగారు బొమ్మలా వున్నావ్. - ఆయన్ని ఎలా చేసుకున్నావని. అలా అడిగినవారందరినోళ్ళు అక్కడే మూయించాను నిజం మాధవీ ... అందాన్ని మనం ఏమిచేసుకోగలం ? అందం శాశ్వతం కాదని తెలిసికూడా దానికే మనం ఎక్కువ ప్రాముఖ్యతయిచ్చి సంసారాలు నాశనం చేసుకోవడం అర్థంలేనిపని. అందంగా

వున్న భర్తలు ఎంతమంది తమ భార్యలను బాధలు పెట్టటంలేదు. ఎక్కడో ఎందుకు సుమిత్ర తెలుసుకదూ అడిగింది.

తెలుసన్నట్టు చూసింది మాధవి.

"సుమిత్ర తనభర్త అందగాడని ఆయన అందంచూస్తుంటే తనకే జెలసీగా వుంటుందని చెబుతుంటుంది. ఆయన ఈమెని సరిగ్గా చూడడు ఇంకా ముగ్గురు, నలుగురు స్త్రీలతో సంబంధంవుంది. రోజూ తాగి యింటికవచ్చి సుమిత్రను చావకొడతాడు. కోటి తనని బాధ పెడుతున్నా ఆమె తన భర్త అందాన్ని గురించి రోజూ డప్పుకొడతూ వుంటుంది. నిజానికి అందమైన భర్తతో ఆమె ఏం సుఖపడుతున్నది. అందుకే నేను ఈ అందానికి ప్రాముఖ్యత యివ్వను. ఆయన నన్ను విడిచి క్షణం వుండలేరు. ఎక్కడికి వెళ్ళినా యిద్దరం కలిసి వెళ్ళవలసిందే. తలనొప్పిగా వుండి పడుకుంటే విలవిల్లాడిపోతారు. ఆయనగురించి చెప్పాలంటే మాటలు చాలవు మాధవీ."

మాధవి విస్తుపోయి చూసింది మాలతిని.

"ఇంతకీ మా యిల్లు పూర్తిగా చూడలేదు కదూ" అంటూ లేచి నిల్చుంది మాలతి.

మాధవి కూడా నిల్చుంది.

ఇంతలో-

బయట ఆటో ఆగినచప్పుడు వినిపించింది.

ఇద్దరూ అటువైపు చూశారు.

గేటు నెట్టుకుని లోపలకు వచ్చింది ఎవరో ఒకామె. మొదట్లో గుర్తుపట్టలేదు గాని తరువాత యిద్దరూ గుర్తించారు ఆమెను.

"సుందరి" ఆశ్చర్యంగా ఇద్దరూ ఒకేసారి అన్నారు. ఆమె లోపలకి వచ్చింది.

"నిన్ను గుర్తించలేదు....ఏమిటీలా అయిపోయావ్" అడిగింది మాలతి.

"స్మాల్ పాక్స్ వచ్చింది" నిర్జీవంగా నవ్వుతూ చెప్పింది సుందరి.

ఆమె ముఖం నిండా గుంటలు నల్లగా వికృతంగా వున్నాయి. మనిషి సన్నగా పీలగా అయిపోయింది. ముఖంలో వర్చస్సు లేదు ప్రేతకళ ఆమె ముఖాన్ని కప్పివేసింది. ఒకప్పుడు ఆమె తను అందమైన దాన్నని మిడిసిపడేది. అగ్లీగా వుండేవాళ్ళతో మాట్లాడేది కాదు. ఇప్పుడు ఆమె అందం పతనమైన శిల్పంలా వుంది.

ఆమెను చూస్తుంటే భయం వేసింది నెల రోజుల క్రితం వరకు పాలరాతి బొమ్మలా వున్న సుందరి ఇప్పుడెలా అయింది. తనకి కూడా స్మాల్‌పాక్స్ వస్తే తన అందం కూడా....ఆ పైన ఊహించలేక పోయింది మాధవి.

సుందరిని చూస్తూ అక్కడ నిలువలేక "వెళ్ళొస్తాను మాలతీ" అంటూ చక చకా బయటకు నడిచింది.

రాజమ్మ వచ్చే సరికి చేతుల్లో ముఖం దాచుకొని కళ్ళు వాచేలా ఏడుస్తుంది మాధవి. జరిగిందంతా రాజమ్మకు చెప్పింది మాధవి.

"అయ్యగారు చాలామంచి వారమ్మా ఆయన రూపం నలుపైనా మంచి మనస్సున్న మనిషి. అటువంటి వారు మీకు భర్త కావడం మీ అదృష్టం అమ్మగారూ" అంటూ కళ్ళు తుడిచింది. రాజమ్మ తల్లిని మరపిస్తూ.

పదినిముషాల తర్వాత.

"నాకు నెలలు నిండినయ్ అమ్మగారూ. పుట్టింటికి వెళ్ళి కాన్పు చేయించుకుని రావాలి" అంది ముఖం మీద నవ్వు తెచ్చుకుంటూ రాజమ్మ

"వెళ్ళరా రాజమ్మా" అంది సంతోషంతో. అప్పుడు తెలిసింది మాతృత్వము లోని విలువ దాని ఆనందము మాధవికి.

"మరి ఎట్లా వెళతానో ! అయ్యగారి విషయం" అంటూ ఆగింది "నిజమే రాజమ్మా నువెళ్ళితే నీలా ఆప్యాయతగా ఆయనను చూసే దెవరు" అంది మాధవి

ఆ గొంతులో ఆదుర్దాను గమనించి "మీరెంత పిచ్చివారండీ ! ఈ సంఘములో అందరు మిమల్ని గౌరవంగా చూడాలంటే

మీరు అయ్యగారిలో పూర్తిగా ఏకమైపోవాలి చూడమ్మా. అయ్యగారు లాంటి వ్యక్తులు వుండరమ్మా ! మీరేవో కథలు చదువుతారు. అవి కల్పనలేనని మీకు తెలుసు బ్రహ్మ దేవుడుమాత్రం అలాంటి బొమ్మలకి ప్రాణం పొయ్యడు. ఒకవేళ పోసినా, మనస్సుని బీభత్సంగా సృష్టిస్తాడు. చిన్న జ్వరాలకి బలియై పోయే అశాశ్వతమైన అందముకన్నా ఎలాంటి బీభత్సాలకి, పెను తుపానులకు మారనటువంటి మంచి మనస్సు వున్న వ్యక్తి అయ్యగారు." అలా చెప్పి వెళ్ళిపోతున్న రాజమ్మనుపిల్చి తను కట్టుకొనే చీరనుయిచ్చింది.

తను చెప్పదల్చుకొన్న మాటలు చెప్పి ఆనందముతో కాళ్ళకు నమస్కారము చేయబోయిన రాజమ్మను "నీ ఉన్నతమైన సంస్కారమును చేరుకోవాలంటే నేను నీ అంత పెరగాలి. అప్పుడే నాకా అర్హత" లేవదీసింది మాధవి. ఆ గొంతులో పశ్చాత్తాపం ప్రస్ఫుటంగా కనిపించింది రాజమ్మకు.

రాజమ్మ వెళుతున్న వైపే చూస్తూ నిల్చుంది మాధవి

* * *

రాత్రి ఎనిమిది గంటలయింది. కర్టెన్ మీద రాధా మాధవుల చిత్రాన్ని ఎక్షగా చూస్తోంది తన జీవితాన్ని ప్రేమమయము చేసుకోవాలని ఊహిస్తూ. ప్రశాంతతను భంగపరచిన టకటక బూట్లు చప్పుడు వినిపించి తలత్రిప్పి చూసింది.

శ్రీధర్ !

"ఏమండి" అంటూ ఎంతో ఆప్యాయముగా పలకరించాలని ప్రయత్నించింది మాధవి. కాని పిలువలేకపోయింది. తన గదిలోకి వెళ్ళిపోయాడు శ్రీధర్.

పరుగున తన గదిలోకి వెళ్ళింది మాధవి దెబ్బతిన్న పులిలా.

తరువాత ఎప్పటికో శ్రీధర్ గదిలోకి వెళ్ళింది. ప్రయాణ అలసటతో నిద పోతున్నాడు శ్రీధర్

"అబ్బ ! ఈయనలో ఎంత మార్పు వచ్చింది... గుండ్రని ముఖం అకళ్ళలో ఏదో వింత అందము యిమిడి వుంది. ముక్కు అందముగా ముఖమునకు సరిపోయినట్లున్నది. చామన ఛాయేకాని అందము అంతా మూర్తిభవించి వున్నది. వీరినేనా అన్ని మాటలు అన్నాను" అనుకుంటూ, అదిరే గుండె దిటవు చేసుకొని "లేవండి" అంటూ


# ప్రగతి

## చందా రేట్లు

| | ఏజంటు ద్వారా | పోస్టు ద్వారా |
|---|---|---|
| 3 నెలలకు | 7-80 | 8-50 |
| 6 నెలలకు | 15-60 | 17-00 |
| 12 నెలలకు | 31-20 | 34-00 |

భుజంమీద చెయ్యి వేసింది. వేడిగా వుంది. నుదురుమీద చెయ్యి వేసి చూసింది. వేడిగా వుంది. వెంటనే డాక్టరుకు ఫోన్ చేసింది.

"టైఫాయిడ్. ఆదరణతో చూసే వ్యక్తి సపర్యలు కావాలి" అన్నాడు డాక్టరు. డాక్టరుకి కూడా తెలుసు శ్రీధర్ ని మాధవి సరిగా చూడదని.

"డాక్టర్ !" అంటూ దెబ్బ తిన్నట్టుగా చూసింది మాధవి.

"రంగుటద్దాలనుండి చూసే తత్వానికి స్వస్తి చెప్పాను డాక్టరుగారూ! వారు నా ప్రాణం." కోపంగా అంది.

మాట్లాడకుండా ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చి వెళ్లాడు డాక్టర్.

ఆ నాటి నుండి పదిహేను రోజులవరకు నిద్రాహారాలు మాని శ్రీధర్ కు సేవ చేసింది. మళ్ళీ మామూలు మనిషి అయ్యాడు శ్రీధర్. మాధవి ఆప్యాయముగా చూస్తూ టైమ్ కి టానిక్, పాలు యిస్తూ ప్రాణానికి ప్రాణంగా చూచుకుంది. పదిహేను రోజులలో శ్రీధర్ ఎవ్వరూహించలేనంతగా పుష్టిగా అందంగా తయారయ్యాడు. భర్తనుచూసి సంతృప్తిగా నవ్వింది మాధవి

•

అద్దము ముందు నిల్చుని తల దువ్వుకుంటూ — "ఈ చిన్ని కళ్ళలో ఇంత అందం, మొఖంలో ఈ కళ, ఈ శరీరములో యింత మెరుపు. ఇదివరకటి కంటె డబల్ అయ్యాను. కారణం ఏమిటో" చిలిపిగా మాధవివైపు చూస్తూ అన్నాడు శ్రీధర్.

"ఏమో. నాకు తెలీదు" అంది మాధవి.

"నే చెప్పనా" అడిగాడు శ్రీధర్.

"చెప్పండి" అంది నవ్వుతూ.

"ఆదరణ అనే టాబ్లెట్స్ — అప్యాయత అనే ఇంజక్షను — ప్రేమనే టానిక్ — వాడావుగా. అందువల్లనే ఈ మార్పు. సెకండ్ షోకు వెళదాము వస్తావా? లేక ఈ అనాకారితో ...." మాటలు పూర్తి కాక ముందే తన పొందుగాటి వేళ్ళతో శ్రీధర్ పెదవులను కప్పివేసింది మాధవి.

"అలాంటి మాటలు ఎప్పటికీ అనకండి. నాలో మార్పును గమనించారుగా" అంది చాలా నెమ్మదిగా — బాధపడుతూ.

నవ్వుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసి బయలు దేరాడు నిండుగా పరిపూర్ణత సిద్ధించిన గృహిణిలా కన్పించింది శ్రీధర్ కి మాధవి ఆ క్షణంలో

శ్రీధర్ ఆ మలుపు తిరిగే వరకూ నిల్చుని లోపలకు వెళ్ళింది మాధవి. సాయంత్రం వరకు భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఆఫీసునుంచి వస్తున్న శ్రీధర్ కు వాకిలి దగ్గర స్వాగతం పలుకుతున్నట్లు నిల్చున్నది మాధవి. చంద్రుని చూసిన కలువలాగా ఉప్పొంగి పోయింది ఆనందములో అతనిని చూసి

"అలసి వచ్చిన ఆఫీసరుగారు అందుకోండి మా చేతికాఫీ" అంది కొంటెగా నవ్వుతూ శ్రీధర్ లోపలకు రాగానే కాఫీ అందిస్తూ.

"మనసు మార్చుకొన్న సతీమణీ అందుకో ఈ చిన్ని ప్రెజెంట్, మన నూతన జీవితానికి కానుకగా" అంటూ ఎరుపు పట్టుచీరను మాధవి భుజముల వారగా వేసి దగ్గరికి తీసుకున్నాడు. గువ్వలా ఒదిగి పోయింది మాధవి శ్రీధర్ కౌగిలిలో.

